




సభా వేదిక స్థలాన్ని పరిశీలిస్తున్న నంద్యాల జిల్లా టీడీపీ నాయకులు



జోరుగా జూదం..!

- పేకాట, చింతపిక్కలాట
- రూ.లక్షలు చేతులు మారుతున్న వైనం
- క్లబ్ తరహాలో నిర్వహణ
- పోలీసులకు నెలకు రూ.లక్షల్లో మామూళ్లు

నంద్యాల, ఆంధ్రజ్యోతి:
మూడు నెలల క్రితం అవుకు మండల పరిధిలోని కొండల సమీపంలో పోలీసులు దాడి చేసి పెద్ద సంఖ్యలో పేకాటరాయుళ్లను పట్టుకున్నారు. వారి నుంచి భారీగా నగదు స్వాధీనం చేసుకున్నారు. అప్పటి నుంచి జూదాన్ని పూర్తిగా కట్టడి చేశామని పోలీసు అధికారులు గొప్పగా చెప్పుకుంటున్నారు. వినేవారికి ఇది నిజమనిపిస్తుంది. కానీ అవన్నీ ఒట్టి మాటలేనని ఇక్కడి పరిస్థితులు చెబుతున్నాయి. ఈచుట్టు పక్కల ప్రాంతాల్లో జూదం విచ్చలవిడిగా సాగుతోందని, ఒక్క పేకాటే కాకుండా, చింతపిక్కల ఆట కూడా జోరుగా సాగుతోందని, ఇందుల్లో లక్షల రూపాయలు చేతులు మారుతున్నాయని తెలుస్తోంది. ఇదంతా బనగానపల్లె సర్కిళ్లలో ఓ ఇద్దరు పోలీసు అధికారుల కనుసన్నల్లో జరుగుతున్నట్లు సమాచారం. అందుకే పోలీసులు అటు వైపు కన్నెత్తి చూడటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

అనువైన స్థలాన్ని చూసి..

వైసీపీ ప్రభుత్వంలో జూదం విచ్చలవిడిగా సాగుతోంది. అధికార పార్టీ నేతల అండదండలతో వారి అనుయాయులు కొండలు, చేలు, పాడుబడిన గోడౌన్లను అడ్డాలుగా మార్చుకుంటున్నారు. అక్కడ జూదం నిర్వహిస్తూ రూ.లక్షల్లో డబ్బులు గడిస్తున్నారు. ఈ వ్యవహారం బనగానపల్లె నియోజకవర్గ పరిధిలో ఎక్కువగానే సాగుతోందన్న విమర్శలు ఉన్నాయి. బనగానపల్లెలోని ఇల్లూరుకొత్తపేట సమీపంలోని పొలంలోని ఓ గదిలో, నందవరంలోని సుద్ద ఫ్యాక్టరీలో సమీపంలోని ఓ గదిలో, అలాగే బనగానపల్లె పట్టణంలోని నంద్యాల రహదారిలోని రౌండ్ల సమీపంలో, సంజామల మండలంలోని నొస్సంలో పేకాట సాగుతున్నట్లు సమాచారం. ఈ స్థావరాలన్నీ ఊరికి కూతవేటు దూరంలోనే ఉండటం గమనార్హం. పేకాటరాయుళ్లకు అవసరమైన సౌకర్యాలు కల్పించి, వారికి కావాల్సినవి అందుబాటులో ఉంచి క్లబ్ తరహాలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది. పేకాటతోపాటు చింతపిక్కలాటను కూడా ఆడిస్తున్నారు.

ఒక్కో ఆటకు రూ.లక్షల్లోనే..

ఒక్కో ఆటకు రూ.లక్షలు చేతులు మారుతున్నాయని సమాచారం. జూద నిర్వాహకులు ముఖ్యంగా వ్యాపారులు, ఉద్యోగులు, బాగా డబ్బున్న వారినే అనుమతిస్తారు. కనీసం రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు చేతిలో ఉంటేగాని జూదరులకు ప్రవేశం. లేదంటే అనుమతించరు. గతంలో అవుకు మండల పరిధిలోని పేకాట స్థావరాలపైన పోలీసులు దాడి చేసినప్పుడు జిల్లాకు చెందిన వారే కాకుండా కర్నూలు, కడప, అనంతపురం జిల్లాలకు చెందిన వారు కూడా ఉండటం గమనార్హం. ఇక చింతపిక్కలాటలో కూడా ఇదే స్థాయిలో డబ్బులు చేతులు మారుతున్నట్లు సమాచారం. ఆయా స్థావరాల్లో నిర్వహించే ఈ ఆటలతో నిర్వాహకులు రోజుకు దాదాపు రెండు రూ.లక్షల మేర ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నారని సమాచారం. ఈ లెక్కన రోజుకు ఈ నాలుగైదు స్థావరాల్లో కలిపి రూ.10 లక్షల వరకు చేతులు మారుతున్నట్టు తెలుస్తోంది.



నాయకుల అండదండలు..

ఇక్కడ ఈ స్థాయిలో జూదం నడవడం వెనుక పోలీసులతోపాటు నాయకుల అండదండలు పుష్కలంగానే ఉన్నాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. జూద నిర్వాహకులు అధికార పార్టీ నాయకుడి అనుయాయులు కావడంతో పోలీసులు దాడి చేయగానే సదరు నేతల నుంచి ఫోన్లు వెళతాయి. దీంతో పోలీసులు మిన్నకుండి పోతున్నారు. ఇక దాడి చేయకుండా ఉండాలంటే పోలీసులకు నెలకు ఇంత అని ఇస్తే ఏ గొడవ ఉండదు కదా అని సలహా ఇస్తుండటంతో నిర్వాహకులు నెలకు రూ.లక్షల్లో ముట్టజెపుతున్నారని సమాచారం. ఇందులో వచ్చే మొత్తంలో కొస్త సదరు నేతలకు వాటాగా వెళుతున్నట్లు తెలుస్తోంది. మొత్తానికి నిర్వాహకులకు నేతల హస్తం, పోలీసుల సహకారంతో బనగానపల్లె నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో జూదం మూడు పూవులు, ఆరు కాయలుగా సాగుతోంది. ఇప్పటికైనా అధికారులు జూద స్థావరాలపై ఉక్కు పాదం మోపి కట్టడి చేస్తే బాగుంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నియంత్రించాల్సిన వారే..

నియోజకవర్గ పరిధిలో చార్జి తీసుకునే కొత్త పోలీసు అధికారి ఎవరైనా ఇక్కడి జూదాన్ని అడ్డుకుంటామని, గుట్కా, మట్కా వంటివి పూర్తిగా నిర్మూలిస్తామని చెప్పడం పరిపాటిగా మారింది. అయితేఅవన్నీ వట్టి మాటలేనని ఇక్కడి పరిస్థితులను చూస్తే అర్థమవుతోంది. జూదంలో రూ.లక్షల్లో చేతులు మారుతున్న వైనాన్ని దగ్గరి నుంచి చూసి, కళ్లు చెదిరిన ఓ ఇద్దరు అధికారులు నిర్వాహకులతో మిలాఖత్ అయినట్లు తెలుస్తోంది. నెలకు ఒక్కో నిర్వాహకుడి నుంచి రూ.లక్ష వసూలు చేస్తూ, జూదానికి అడ్డు రాకుండా చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఒకవేళ పై అధికారుల ఒత్తిడి ఎక్కువైతే నామమాత్రంగా దాడులు చేస్తున్నారు. గతంలో అవుకు మండల పరిధిలోని ఎర్రమల కొండల్లో పేకాట స్థావరంపై దాడి చేసినప్పుడు ఓ ముగ్గురు పోలీసులు దొరికినా చర్యలు తీసుకోలేదు.

బాబు సభకు ఏర్పాట్లు

- 12 ఎకరాల్లో సభా వేదిక
- పరిశీలించిన టీడీపీ నాయకులు

ఆళ్లగడ్డ, జనవరి 5: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఈ నెల 9వ తేదీన ఆళ్లగడ్డకు వస్తుండటంతో.. లక్ష మందితో భారీ బహిరంగ సభ నిర్వహించడానికి ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. సభా వేదికను 12 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం సభా స్థలిలో ఉన్న కంప చెట్లను తొలగించే కార్యక్రమం మొదలు పెట్టారు. ఈ సభా వేదిక స్థలాన్ని ఉమ్మడి కర్నూలు జిల్లా టీడీపీ పరిశీలకులు మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి, టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, టీడీపీ ఇన్‌చార్జిలు ఎన్‌ఎండీ ఫరూక్, గౌరు వెంకటరెడ్డి, బుడ్డా రాజశేఖరరెడ్డి, ధర్మవరం సుబ్బారెడ్డి, భూమా విఖ్యాత్‌రెడ్డి, భార్గవ్‌రామ్‌నాయుడు, రవి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ చౌదరి, మాజీ మంత్రి అఖిలప్రియ, మల్లెల రాజశేఖర్ మాట్లాడుతూ తెలుగుదేశం పిలు స్తోంది రా అంటూ టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావు పిలుపునకు యావత్ తెలుగు ప్రజానీకం ఆయన వెంట నడిచిందని, ఇపుడు అదే నినాదంతోనే సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో దూసుకెళ్లాలని అన్నారు. ఈ మేరకు టీడీపీ కార్యాచరణ రూపొందించిందని అన్నారు. మాజీ సీఎం చంద్రబాబును నంద్యాలలోనే అరెస్టు చేసినందుకు జిల్లా ప్రజలు వైసీపీ పాలనకు అంతం పలికేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఆళ్లగడ్డ నుంచే చంద్రబాబు ఎన్నికల శంఖారావం పూరిస్తారని అన్నారు. 25 సంవత్సరాల తరువాత ఆళ్లగడ్డలో బహిరంగ సభను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

వైసీపీని బంగాళాఖాతంలో కలిపేస్తాం

- క్రైస్తవ మైనార్టీలు, దళితుల ద్రోహి జగన్
- నంద్యాలలో టీడీపీ క్రిస్టియన్ సెల్ ఆధ్వర్యంలో నిరసన

నంద్యాల నూనెపల్లె, జనవరి 5 : క్రైస్తవ మైనార్టీలు, దళితుల ఓటు బ్యాంకుతో అధికారంలోకి వచ్చిన జగన్ వారిని నిలువెల్లా ముంచి మోసం చేశారని, వచ్చే ఎన్నికల్లో వైసీపీని బంగాళాఖాతంలో కలిపేస్తామని టీడీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామిదాసు హెచ్చరించారు. నాలుగున్నరేళ్ల పాలనలో జగన్ క్రైస్తవ మైనార్టీల సంక్షేమాన్ని విస్మరించి మోసం చేసినందుకు నిరసనగా టీడీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాస్టర్ దువ్వూరు భాస్కర్ ఆధ్వర్యంలో నంద్యాలలోని బొమ్మలసత్రం సెంటర్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహం ఎదుట ధర్నా చేపట్టారు. ఈటె స్వామిదాసు, క్రిస్టియన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల నాగరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాబ్‌రాజ్, రాష్ట్ర కార్యదర్శి సుందర్‌రాజుతోపాటు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, న్యాయవాది వెదుర్ల రామచంద్రరావు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌ఎండీ ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామిదాసు మాట్లాడుతూ తాను క్రిస్టియన్ అని చెప్పుకుంటున్న జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని క్రిస్టియన్లకు ద్రోహం చేశారని ధ్వజమెత్తారు. దళిత క్రైస్తవులు, దళితులకు గత టీడీపీ ప్రభుత్వంలో 28 సంక్షేమ పథకాలు అమలు చేస్తే వైసీపీ ప్రభుత్వం వాటిని రద్దు చేసి అన్ని రంగాల్లో మైనార్టీల అభివృద్ధిని అడ్డుకున్నదని మండిపడ్డారు. కార్యక్రమంలో క్రిస్టియన్ మైనార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు, మాజీ కౌన్సిలర్ దూదేకుల దస్తగిరి, గోకుల విజయానంద్ పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం ఎదుట ధర్నా చేస్తున్న టీడీపీ నాయకులు

మున్సిపల్ కార్మికుల పొర్లు దండాలు

వినూత్న రీతిలో నిరసన

నంద్యాల టౌన్, జనవరి 5: జిల్లా వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు నిరసనలతో హోరెత్తిస్తున్నారు. ఆళ్లగడ్డ, నంద్యాల, ఆత్మకూరు, నందికొట్కూరు మున్సిపాలిటీల్లో కార్మికులు సమ్మెను కొనసాగిస్తున్నారు. జిల్లా కేంద్రమైన నంద్యాలలో కార్మికులు వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. పొర్లుదండాలు పెడుతూ సీఎం జగన్‌కు మంచి బుద్ధి ప్రసాదించాలి స్వామీ అంటూ భగవంతుడిని వేడుకున్నారు. ఇన్ని రోజులుగా సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వంలో ఎలాంటి చలనం లేకపోవడం విచారకరమన్నారు. సమాన పనికి సమాన వేతనం, సంక్షేమ పథకాల అమలు, స్కిల్డ్, సెమీ స్కిల్డ్ కార్మికులకు వేతనాలను అర్హులకు ఇవ్వాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరించాలన్నారు. ఎన్నికల ముందు జగన్ రెడ్డి ఇచ్చిన హామీలనే తాము అడుగుతున్నామన్నారు. డిమాండ్లను నెరవేర్చకపోతే వచ్చే ఎన్నికల్లో జగన్ పార్టీకి తగిన బుద్ధి చెబుతామని కార్మికులు హెచ్చరించారు. మున్సిపల్ కార్మికుల నిరసనలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌ఎండీ ఫిరోజ్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క చాన్స్ అంటూ ప్రజలందరినీ మభ్యపెట్టి ఓట్లు దండుకొని గద్దెనెక్కిన వైసీపీ ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా అన్ని వర్గాలను మోసం చేసిందన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్, కార్యదర్శి గౌస్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్, పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, మున్సిపల్ కార్మికుల సంఘం నాయకులు కృష్ణయ్య, భాస్కరాచారి, రంజిత్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



పొర్లు దండాలతో నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ కార్మికులు

బిల్లులు లేని ఫేజ్-2

- నాడు - నేడులో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే
- అసంపూర్తిగా పాఠశాల ప్రహరీలు, గదుల నిర్మాణం
- పునాదులకే పరిమితమైన అంగన్‌వాడీ కేంద్రాలు
- తుప్పుబడుతున్న ఇనుప కడ్డీలు
- ఇబ్బందుల్లో విద్యార్థులు

రుద్రవరం, జనవరి 4 : నాడు-నేడు గురించి ప్రభుత్వం చేసిన ప్రచారం అంతా ఇంత కాదు. పాఠశాలను సరికొత్తగా తీర్చిదిద్దడమే లక్ష్యమని సీఎం జగన్ ప్రకటించుకున్నారు. నాడు-నేడు ఫేజ్1 కింద పాఠశాలల మరమ్మతులు, గదులు, ప్రహరీల పనులు చేపట్టారు. మొదటి విడత రూ.13.33 కోట్లు మంజూరయ్యాయి. ఆ మేరకు పనులు చేపట్టారు. ఆ తర్వాత నిధులు లేక, బిల్లులు ఇవ్వక నాడు-నేడు ఫేజ్-2 పనులు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. నెలల తరబడి పనుల్లో పురోగతి లేకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. రుద్రవరం మండలంలో ఫేజ్-2 పనులు మధ్యలోనే ఆగిపోయాయి. అప్పట్లో అధికారులు హడావుడి చేశారు. కానీ నిధులు ఖాళీ కావడంతో కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వలేదు. దీంతో పనులు అసంపూర్తిగానే నిలిచాయి. కొండమాయపల్లె, మందలూరు, నరసాపురం, శ్రీరంగాపురం, బి. కొట్టాల, పేరూరు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రం పనులు చేపట్టాల్సి ఉంది.

నాడు - నేడు ఫేస్-2 పనులు ఇలా

హరినగరం, ఆలమూరు మెయిన్, చిత్తరేణిపల్లె, ఆలమూరు స్పెషల్, ముకుందాపురం, ఉన్నత పాఠశాల ఆలమూరు, బీరవోలు, చిలకలూరు, చిన్నకంబలూరు స్పెషల్, అప్పనపల్లె, ఎర్రగుడిదిన్నె, మాకినేనిపల్లె, ఎర్రగుడిదిన్నె ఉన్నత పాఠశాల, కె. కొత్తూరు, మందలూరు, మందలూరు స్పెషల్, నల్లవాగుపల్లె, నక్కలదిన్నె, ముత్తలూరు, ముత్తలూరు స్పెషల్, తిమ్మనపల్లె, నరసాపురం, నరసాపురం ఉన్నత పాఠశాల, జడ్పీ హెచ్‌స్కూలు పెద్దకంబలూ రు, బి. నాగిరెడ్డిపల్లె, ఆర్. నాగులవరం, ఆర్. కొత్తపల్లె, రుద్రవరం స్పెషల్, రెడ్డిపల్లె, రుద్రవరం, తువ్వపల్లె, కస్తూర్బాగాంధీ రుద్రవరం, బి. కొట్టాల, యల్లావత్తుల స్పెషల్, యల్లావత్తుల ఉన్నత పాఠశాలలోల పనులు పూర్తి చేయాల్సి ఉంది. ఈ పాఠశాలల్లో వివిధ స్థాయిల్లో పనులు నిలిచిపోయాయి.



రుద్రవరం మండలం బీరవోలులో అసంపూర్తిగా ఉన్న ప్రహరీ, వంటశాల పనులు



దక్షిణకొట్టాలు గ్రామంలో అసంపూర్తిగా ఉన్న ప్రహరీ పనులు

ఇబ్బందుల్లో విద్యార్థులు

గదులు నిర్మాణ పనులు పూర్తి కాకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. నరసాపురం ఉన్నత పాఠశాల విద్యార్థులను శిథిలావస్థకు చేరిన భవనాల వరండాల్లో కూర్చోబెడుతున్నారు. అలాగే ఆర్. కొత్తపల్లెలో ఓ ఇంటిలో విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్నారు. నక్కలదిన్నె గ్రామంలో గ్రామ చావిడిలో విద్యాబోధన చేస్తున్నారు. మిగిలిన పాఠశాలల్లో ఉన్న గదుల్లోనే విద్యార్థుల సంఖ్య పెంచి చదువు చెబుతున్నారు.



నిధులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తాం

నిధులు మంజూరైన వెంటనే మళ్లీ పనులు ప్రారంభిస్తాం. నిధులు ఉన్న మేరకు పనులు చేశాం. నిధులు మంజూరైన వెంటనే పనులు పూర్తి చేసి విద్యార్థులకు సౌకర్యం చేకూరుస్తాం.

- తిరుపతయ్య, హెచ్‌ఎం, పెద్దకంబలూరు ఉన్నత పాఠశాల



బిల్లులు మంజూరు కావాల్సి ఉంది

నాడు-నేడు ఫేజ్-2 కింద మొదటి విడత మాత్రమే బిల్లులు మంజూరయ్యాయి. రెండో విడత బిల్లులు మంజూరు కావాల్సి ఉంది. మంజూరైన వెంటనే అన్ని పనులు పూర్తి చేస్తాం.

- మధుసూదన్‌రెడ్డి, నాడు - నేడు ఏఈ, రుద్రవరం మండలం

టీడీపీ కార్యకర్త షాపు తొలగింపు

మహానందిలో ఉద్రిక్తత

మహానంది, జనవరి 5: తెలుగుదేశం పార్టీ కండువా కప్పుకున్న పాపానికి మహానంది మంగలి సుబ్బరాయుడుకు చెందిన బార్బర్ షాపును శుక్రవారం ఉదయం దేవస్థానం సిబ్బంది తొలగించారు. దీంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సుబ్బరాయుడు ఈ నెల 1న బుడ్డా రాజశేఖర్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరాడు. దీన్ని జీర్ణించుకోలేని కొందరు అధికార పార్టీకి చెందిన నాయకులు బార్బర్ షాపును తొలగించాలని దేవస్థానం అధికారులపై ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. దీంతో ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే సుబ్బరాయుడు షాపును తొలగించారు. సీసీ రహదారి నిర్మించడం కోసం తొలగిస్తున్నామని సిబ్బంది చెప్పగా సుబ్బరాయుడు అడ్డుకునే ప్రయత్నం చేశారు. కొంత సమయం కావాలని కోరినా వినిపించుకోకుండా సిబ్బంది షాపును తొలగించారు. ఈ క్రమంలో కొన్ని అద్దాలు పగిలిపోయాయి. విషయం తెలుసుకున్న టీడీపీ మహానంది ఇన్‌చార్జి గని చిన్న రంగస్వామి, సూరే శ్రీనివాసులు, తమ్మడపల్లి జనార్దన్‌రెడ్డి. మండల అధ్యక్షులు ఉల్లి మధు, జిల్లా యువత అధ్యక్షులు క్రాంతికుమార్ అక్కడికి చేరుకున్నారు. కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే ఇలా చేస్తున్నారని వారు ఆరోపించారు. సాయంత్రం ఎంఆర్‌పీఎస్ నాయకుడు లక్ష్మణ్‌తో కలిసి దేవస్థానం కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డితో వాగ్వాదానికి దిగారు. చివరకు ఇరువురి అంగీకారం మేరకు సమీపంలోని భారీ నంది విగ్రహం ముందు సుబ్బరాయుడుతోపాటు మరి కొందరికి లాటరీ పద్ధతిన స్థలం కేటాయించారు. దీంతో సమస్య పరిష్కారమైంది.



మహానందిలో టీడీపీ కార్యకర్తకు చెందిన బార్బర్ షాపును తొలగించిన దేవస్థానం సిబ్బంది

మహిళపై అత్యాచార యత్నం

- పరారై మొక్కజొన్న చేనులో దాక్కున్న వైనం
- డ్రోన్ కెమెరాలతో వెతికిన పోలీసులు
- 9గంటల తర్వాత చిక్కిన నిందితుడు..?



నిందితుడి కోసం మొక్కజొన్న తోట వద్ద గాలిస్తున్న పోలీసులు

ఆత్మకూరు, జనవరి 5: పొద్దున్నే మొక్కజొన్న పొలానికి పిట్టల కావలికి వెళ్లిన ఓ మహిళపై ఓ దుండగుడు అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన శుక్రవారం ఉదయం ఆత్మకూరు పట్టణ శివార్లలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు.. పట్టణానికి చెందిన ఓ మహిళ తమ మొక్కజొన్న పంట వద్దకు ఉదయాన్నే వెళ్లింది. 9గంటల సమయంలో ఇంటికి వెళ్తుండగా అక్కడే కంది చేనులో మాటు వేసిన ఓ దుండగుడు ఆమెపై అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. కేకలు వేస్తున్నా వదలకుండా వేధించారు. ఆమె అతన్ని తోసేసి పరుగులు తీసింది. అయితే అదే సమయంలో ఆ మహిళ బంధువు బైక్‌పై రావడంతో దుండగుడు అక్కడి నుంచి పరారయ్యాడు. బాధిత కుటుంబీకులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఆత్మకూరు సీఐ నాగభూషణ్, ఎస్సైలు జీ కృష్ణమూర్తి, వెంకటనారాయణరెడ్డిలు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అయితే అప్పటికే దుండగుడు సమీపంలోని 15 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేసిన మొక్కజొన్న తోటలోకి వెళ్లి దాక్కుతున్నాడు. ఆరు అడుగుల ఎత్తులో మొక్కజొన్న పైరు పెరగడంతో నిందితుడ్ని పట్టుకోవడం పోలీసులకు సమస్యగా మారింది. దీంతో వారు వెంటనే రెండు డ్రోన్ కెమెరాలను తెప్పించి నిందితుడి కోసం గాలింపు చేపట్టినప్పటికీ ఫలితం లేకపోయింది. అయినప్పటికీ పోలీసులు చేను చుట్టూ చేరి సాయంత్రం వరకు అక్కడే మకాం చేశారు. దీంతో ఎట్టకేలకు సాయంత్రం 6గంటల సమయంలో నిందితుడు మొక్కజొన్న చేనులో నుంచి బయటకు రావడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. కాగా మొక్కజొన్న చేనులోకి వెళ్లిన నిందితుడు అప్పటికే మద్యం సేవించడంతో సాయంత్రం వరకు దర్జాగా తోటలోనే నిద్రించినట్లు తెలిసింది. ఇదిలావుంటే పట్టుబడిన నిందితుడు ఆత్మకూరు మండలం కరివేన గ్రామానికి చెందిన వ్యక్తిగా తెలుస్తోంది. గతంలో కూడా ఇతను ఇదేవిధంగా ఓ మహిళపై అత్యాచారానికి పాల్పడినట్లు సమాచారం. ఈ ఘటనపై పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

నిందితుల అరెస్టు

డోన్, జనవరి 5: డోన్ మండలంలోని ఉంగరానిగుండ్ల గ్రామంలో ఎరుకలి ఖాదర్ హత్య కేసులో 13మంది నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం డోన్ రూరల్ స్టేషన్‌లో డీఎస్పీ శ్రీనివాసరెడ్డి తెలిపిన వివరాల మేరకు... పట్టణంలోని చిగురుమాన్ పేటకు చెందిన లక్ష్మీనారాయణ ఉంగరానిగుండ్ల గ్రామ రహదారిలో పొలం కొనుక్కొని, అక్కడే ఇల్లు కట్టుకున్నాడు. గత ఏడు నెలలుగా లక్ష్మీనారాయణ అక్కడే కుటుంబం నివసిస్తోంది. ఉంగరానిగుండ్ల గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు చిన్నమద్ది, ఆయన కుమా రులకు లక్ష్మీనారాయణ కుటుంబంతో విభేదాలు ఉన్నాయి. డిసెంబరు 12న వైయస్ నగర్‌లో లక్ష్మీనారాయణ బంధువు సీతారాముడుపై చిన్నమద్ది కుమారుడు ఓబులేసు దాడి చేశాడు. దీనికి సంబంధించి ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైంది. ఈ కేసులో రాజీకి రావాలని లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులపై చిన్నమద్ది వత్తిడి తెచ్చాడు. వారు తిరస్కరించారు. ఈ కారణంగా కక్ష పెంచుకొని డిసెంబరు 31న రాత్రి న్యూఇయర్ వేడుకల్లో ఉండగా లక్ష్మీనారాయణ ఇంటిపై చిన్నమద్ది, ఆయన కుమారుడు ఓబులేసు, అనుచరులు దాడి చేశారు. కారు అద్దాలు ధ్వంసం చేశారు. డోన్‌లో నూతన సంవత్సర వేడుకల్లో ఉన్న లక్ష్మీనారాయణ కొడుకు ఖాదర్ ఈ విషయం తెలుసుకొని తన స్నేహితులతో కలసి గ్రామానికి వెళ్లగా వారిపై కూడ దాడి చేశారు. ఖాదర్ తలకు బలమైన గాయాలయ్యాయి. ఆయనను డోన్ ఆస్పత్రికి, అక్కడి నుంచి కర్నూలుకు తరలించారు. అప్పటికే ఖాదర్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి తండ్రి లక్ష్మీనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు 12మందిపై కేసు నమోదు చేశామని, తమ దర్యాప్తులో మాత్రం 14మంది దాడిలో పాల్గొన్నట్లు తెలిసిందని డీఎస్పీ అన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసుతో పాటు హత్య కేసు నమోదు చేశామని, ఇందులో 13 మంది నిందితులను అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరు పరచగా న్యాయాధికారి రిమాండ్‌కు ఆదేశించారని డీఎస్పీ వివరిం చారు. మరో నిందితుడు రామ్మోహన్ పరారీలో ఉన్నారని, అతడి కో సం గాలిస్తున్నామని డీఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో పట్టణ సీ ఐ ప్రవీన్‌కుమార్, ఎస్ఐలు సుధాకర్‌రెడ్డి, శరత్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

ప్యాపిలి, జనవరి 5: మండలంలోని ఊటకొండ గ్రామంలో శుక్రవారం విద్యుదాఘాతంతో గంగరాజు(55) మృతి చెందాడు. రైతు పొలంలో గొర్రెలను మేపుతూ.. వాటికి నీరు తాపేందుకు బోరు దగ్గరకు వెళ్లాడు. అయితే బోరులో నీరు రాలేదు. ఫ్యూజ్ పోయిందేమోనని చూస్తుండగా ప్రమాదవశాత్తు గంగరాజు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు జలదుర్గం పోలీసులు తెలిపారు.

ఆర్‌బీకేల ద్వారా కందుల కొనుగోలు కేంద్రాలు

జేసీ టి.రాహుల్ కుమార్‌రెడ్డి

నంద్యాల టౌన్, జనవరి 5: ఆర్‌బీకేల ద్వారా కందుల కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైనట్లు జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కందులను అమ్మేందుకు రైతులు తమ సమీపంలోని ఆర్‌బీకేలలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. కందులు కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చినప్పుడు నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉండాలని అన్నారు. కందుల నాణ్యతా ప్రమాణాలకు సంబంధించి తేమ శాతం 12 శాతం, మిశ్రమ పదార్థాలు 3 శాతం, ఇతర పంట గింజలు ఒక శాతం, పాక్షికంగా దెబ్బతిన్న గింజలు 3 శాతం, విరిగిపోయిన, విడిపోయిన గింజలు 3 శాతం, నులిపురుగు గింజలు 3 శాతం, పరిపక్వత, కుంగిపోయిన గింజలు 3 శాతంకు లోబడి ఉండాలని అన్నారు. రైతులు అమ్మిన పంటకు సంబంధించి డబ్బు వారి ఆధార్ నంబరుకు అనుసంధానమైన బ్యాంక్ ఖాతాలో జమ అవుతుందని తెలిపారు. రైతులు తమ పంటను కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చి కాటా వేసి లారీకి ఎక్కించే వరకు హమాలీ ఖర్చులను రైతులే భరించాలని తెలిపారు. గోనె సంచులు, రవాణా సౌకర్యాలు, గోదాముల దగ్గర హమాలీ ఖర్చులు మార్క్‌ఫెడ్ వారు ఏర్పాటు చేస్తారని అన్నారు. మార్కెట్ రేటును ఏ రోజుకారోజు ఆర్‌బీకేల వద్ద తెలియజేస్తామని వివరించారు.

ఎన్నికల నిర్వహణకు చర్యలు చేపట్టాలి

నంద్యాల క్రైం, జనవరి 5 : రానున్న సార్వత్రిక ఎన్నికలు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలతో ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి సెల్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బంది తీరు తెన్నులపై దిశానిర్దేశం చేశారు. జిల్లా వ్యాప్తంగా గత ఎన్నికల్లో నమోదై ట్రయల్ నడుస్తున్న కేసుల స్థితిగతులు, జిల్లాలో గుర్తించిన అతి సమస్యాత్మక, సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల వివరాలు, లైసెన్స్‌డ్ తుపాకులు, ఎన్‌బీడబ్ల్యూఎస్, గ్రామాలకు సంబంధించిన సమాచారం, చెక్‌పోస్టులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు తదితర వాటిపై సూచనలు చేశారు.

గుమ్మనూరు ఔట్..!



- ఆలూరు టికెట్‌పై తేల్చి చెప్పిన సీఎం జగన్
- బొజ్జమ్మకైనా ఇవ్వమని కోరిన మంత్రి జయరాం
- లిస్ట్ వస్తుంది.. చూసుకో..! అని చెప్పిన ముఖ్యమంత్రి
- ఆలూరుకు వినిపిస్తున్న హిమవర్షిణీరెడ్డి, విరుపాక్షి పేర్లు

కర్నూలు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి):

ఆలూరు బరిలోకి దిగకముందే మంత్రి గుమ్మనూరు జయరాం ఔట్ అయినట్లేనా..? తాజా రాజకీయ పరిణామాల రీత్యా అవుననే అనిపిస్తోంది. మాజీ జడ్పీటీసీ సభ్యురాలు బొజ్జమ్మతో కలసి మంత్రి జయరాం శుక్రవారం తాడేపల్లి ప్యాలెస్‌లో సీఎం జగన్‌ను కలిశారు. ఆలూరు టికెట్ తనకు కాకపోతే బొజ్జమ్మకు ఇవ్వాలని గుమ్మనూరు కోరారు. ఇందుకు సీఎం.. రెండు మూడు రోజుల్లో లిస్ట్ వస్తుంది, చూసుకోండని చెప్పడంతో నిరుత్సాహంగా వెనుదిరిగారు. దీంతో ఆలూరు వైసీపీ టికెట్ ఎవరికి..? అనే సస్పెన్షన్ కొనసాగుతున్నది. దివంగత మాజీ ఎమ్మెల్యే పాటిల్ నీరజారెడ్డి కుమార్తె హిమవర్షిణీరెడ్డి, చిప్పగిరి జడ్పీటీసీ విరుపాక్షి, తెర్నేకల్లు సురేంద్రరెడ్డి, బళ్లారి మాజీ డిప్యూటీ మేయర్ శశికళ పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో మంత్రి జయరాం ఎంపీగా పోటీ చేస్తారా..? మరో దారి ఎంచుకుంటారా..? అనేది జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది.

మంత్రి గుమ్మనూరు దారెటు?

మంత్రి గుమ్మనూరు జయరామ్‌కు ఆలూరు టికెట్ ఇచ్చేది లేదని సీఎం జగన్ తేల్చి చెప్పారు. ఈ పరిస్థితిలో ఆయన ఏ దారి చూసుకుంటారు? అనే ప్రశ్న తలెత్తుతోంది. శుక్రవారం మంత్రి జయరాం, వైసీపీ నాయకురాలు బొజ్జమ్మ సీఎం జగన్‌ను కలిశారు. అధిష్ఠానం పిలుపు మేరకు విజయవాడకు చేరుకున్న వీరిద్దరూ సాయంత్రం 4.45 గంటల సమయంలో తాడేపల్లి సీఎం క్యాంప్ ఆఫీస్‌కు వెళ్లారు. సుమారు 15 నిమిషాలు సీఎం జగన్, ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి, సీఎంవో ఓఎస్‌డీ ధనుంజయరెడ్డిలతో భేటీ అయ్యారు. ఆలూరు టికెట్ ఈ ఒక్కసారి తనకే ఇవ్వాలని మంత్రి గుమ్మనూరు జయరాం కోరారు. దానికి సీఎం.. పోటీలో ఉండాలనుకుంటే కర్నూలు ఎంపీగా వెళ్లు అని తేల్చి చెప్పినట్లు సమాచారం. తనకు కాకపోతే కప్పట్రాళ్ల బొజ్జమ్మకు అయినా టికెట్ ఇస్తే గెలిపించుకువస్తానని జయరాం అంటే.. రెండు మూడు రోజుల్లో అభ్యర్థుల లిస్టు వస్తుంది అందులో చూసుకోమని జగన్ కర్కశంగా చెప్పేశారని సమాచారం. దీంతో చేసేది లేక తాడేపల్లి ప్యాలెస్ నుంచి జయరాం బయటపడ్డారు. జగన్ సూచన మేరకు ఎంపీగా పోటీ చేయడమా..? ఆలూరు బరిలో ఉండాలనుకుంటే మరో మార్గం ఎంచుకోవడమా? అనేది జయరాం వర్గీయులను వెంటాడుతున్న ప్రశ్నలు. ఎలాగైనా ఎమ్మెల్యేగా పోటీ చేయాలని టికెట్ కోసం మంత్రి జయరాం రాజకీయ ఎత్తులకు పైఎత్తులు వేశారు. కర్ణాటక నుంచి కూడా పావులు కదిపారు. చివరకు సీఎం జగన్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి, ఐప్యాక్ టీఎం ఆడిన రాజకీయ చదరంగంలో జయరాం ఔట్ కాకతప్పలేదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. చిప్పగిరి నుంచి టీడీపీ జడ్పీటీసీగా గెలిచిన గుమ్మనూరు జయరాం 2009లో ఆలూరు నుంచి ప్రజారాజ్యం పార్టీ టికెట్‌పై తొలిసారిగా ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత వైసీపీలో చేరి 2014, 2019లో రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచారు. ప్రస్తుతం కార్మిక శాఖ మంత్రిగా ఉన్న జయరాం వర్గీయులు జగన్ తాజా నిర్ణయంతో రగిలిపోతున్నారు.

ఆలూరు అభ్యర్థిపై తొలగని సస్పెన్షన్!



బొజ్జమ్మ

గత ఏడాది జూన్‌లో ఆస్పరి మాజీ జడ్పీటీసీ కప్పట్రాళ్ల బొజ్జమ్మ టీడీపీని వీడి సీఎం జగన్ సమక్షంలో వైసీపీలో చేరారు. ఆ సందర్భంగా బొజ్జమ్మ ఆలూరు చూసుకుంటుంది.. నీవు కర్నూలు పార్లమెంట్ చూసుకో..! అని వేదికపైనే మంత్రి గుమ్మగనూరు జయరాంకు సీఎం జగన్ సూచించారు. శుక్రవారం మంత్రి జయరాం ఆమె పేరు ప్రతిపాదించినా జగన్ స్పష్టత ఇవ్వకపోవడంతో ఆలూరు అభ్యర్థి ఎవరు..? అనే ప్రశ్న తలెత్తుతోంది. వాల్మీకి సామాజికవర్గం వారికే టికెట్ ఇవ్వాలని జగన్ అనుకుంటే బొజ్జమ్మ, విరుపాక్షి ఇద్దరిలో ఒకరికి ఖాయమని అంటున్నారు. అలా కాకుండా ఓసీ సామాజికవర్గం వ్యక్తికి ఇవ్వాలనుకుంటే అమెరికాలో సాఫ్ట్‌వేర్ కంపెనీ నిర్వహిస్తున్న పాటిల్ హిమవర్షణి రెడ్డి, తెర్నేకల్లు సురేంద్రరెడ్డి పేర్లు వినిపిస్తున్నాయి. హిమవర్షణి అమ్మమ్మ, భర్త కడప జిల్లాకు చెందిన వారు. వారికి వైఎస్ కుటుంబంతో బంధుత్వం ఉంది. అమెరికాకు వైఎస్ కుటుంబ సభ్యులు ఎవరు వెళ్లినా హిమవర్షిణీరెడ్డి ఇంట్లోనే ఉంటారని అంటున్నారు. దీంతో ఆమెకే ఆలూరు టికెట్ ఖాయం అంటున్నారు. అయితే వాల్మీకుల్లో వ్యతిరేకత రాకుండా బొజ్జమ్మ, విరుపాక్షిలలో ఒకరికి ఇవ్వవచ్చు అని కూడా అంటున్నారు. మరో పక్క కురవ సామాజిక వర్గానికి చెందిన బళ్లారి మాజీ డిప్యూటీ మేయర్ శశికళ వైసీపీ టికెట్ కోసం కర్ణాటక, ఢిల్లీ పెద్దల ద్వారా చక్రం తిప్పుతున్నట్లు సమాచారం.

మా హయాంలోనే పాణ్యం అభివృద్ధి

పాణ్యం టీడీపీ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత



మాట్లాడుతున్న పాణ్యం టీడీపీ ఇన్‌చార్జి గౌరు చరిత

కల్లూరు, జనవరి 5: తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలోనే పాణ్యం నియోజకవర్గం సర్వతోముఖాభివృద్ధి చెందిందని ఆపార్టీ పాణ్యం ఇన్‌చార్జి గౌరు చరిత స్పష్టం చేశారు. శుక్రవారం తన స్వగృహంలో ఆమె మాట్లాడారు. చెన్నమ్మ సర్కిల్‌లో గురువారం పాణ్యం సామాజిక సాధికార సభలో వైసీపీ ప్రభుత్వంలో నియోజకవర్గం అభివృద్ధి చెందిందన్న ఎమ్మెల్యే తీరు హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. సీఎం జగన్ ప్రజా వ్యతిరేక విధానాలతో రాష్ట్ర ప్రజలు విసిగిపోయారని, మహిళలు, రైతులు, నిరుద్యోగులు, కార్మికులు, ఉద్యోగులు ప్రభుత్వాన్ని మార్చేందుకు ఒక్క అవకాశం కోసం ఎదురు చూస్తున్నారన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యమని, కాంట్రాక్టర్లకు బిల్లులు రాక పనులు చేయడం మానేశారని, 15 రోజులుగా అంగన్‌వాడీ వర్కర్లు, శానిటేషన్ సిబ్బంది, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు రోడ్డుపైకి వచ్చి ధర్నాలు, నిరసనలు చేస్తున్నా ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉందని విమర్శించారు. పంచాయతీల్లో నిధులను లాగేసుకున్నారని వైసీపీ సర్పంచులే కండువాలు కింద పడేస్తున్నారని గుర్తు చేశారు. పాణ్యంలో రూ.800 కోట్లతో అభివృద్ధి చేశానన్న ఎమ్మెల్యే కాటసాని 16 వార్డులకా, నియోజకవర్గానికా అన్న విషయం స్పష్టం చేయలన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో కల్లూరు అర్బన్ 16 వార్డుల్లో రూ.800 కోట్లు ఖర్చు చేసి సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి పైపులైన్లు మౌలిక వసతులు కల్పించామని గౌరు చరిత తెలిపారు. కార్యక్రమంలో కర్నూలు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌యాదవ్, పాణ్యం వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, కల్లూరు సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు ఎస్వీ రామకృష్ణ, పాణ్యం తెలుగు యువత అధ్యక్షుడు జె. గంగాధర్‌గౌడ్, కల్లూరు పదో క్లస్టర్ ఇన్‌చార్జి పీయూ మాదన్న, మాదేష్ పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- ఇద్దరి దుర్మరణం
- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు



నుజ్జునుజ్జయిన ఆటో

నంద్యాల క్రైం, జనవరి 5: నంద్యాల-కర్నూలు బైపాస్ రోడ్డు సమీపంలోని కుందూ నది బ్రిడ్జిపై ఆటో ఆర్టీసీ బస్సు ఢీకొని ఇద్దరు దుర్మరణం చెందారు. మరో ఇద్దరు ప్రయాణికులకు గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. నంద్యాల నుంచి ముగ్గురు ప్రయాణికులతో ఆటో పాణ్యం వైపు వెళ్తోంది. కుందూ నంది బ్రిడ్జి వద్ద కారును ఆటో డ్రైవర్ దాస్ ఓవర్ టేక్ చేయబోయాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఆటోను ఢీకొంది. దీంతో ఆటో పూర్తిగా ధ్వంసమైంది. ఈ ఘటనలో డ్రైవర్ దాసు (26)తోపాటు అందులో ప్రయాణిస్తున్న మరో మహిళ (28) అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఆటో డ్రైవర్ దాస్ శ్రీశైలం సమీపంలోని సున్నిపెంట ప్రాంతానికి చెందినవాడుగా తెలిసింది. మృతి చెందిన మహిళ వివరాలు తెలియరాలేదు. కేసు నమోదు చేసుకొని మృతుల వివరాలను సేకరిస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు వెల్లడించారు.







నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

శాంతిరాంలో సాంకేతిక సదస్సు

పాణ్యం, జనవరి 5 : మండలంలోని శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం కోడింగ్ క్రషర్స్ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ సాఫ్ట్‌వేర్ శిక్షకులు ఆకాష్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఆయన మాట్లాడుతూ కోడింగ్ ఎలా రాయాలన్న దానిపై అవగాహన కల్పించారు. అమేజాన్, గూగుల్ ప్లే, ఫోన్‌పే లాంటి సంస్థలలో ఉద్యోగం సంపాదించడానికి, ప్లాట్ ఫాం, కోడింగ్ నైపుణ్యాలను పెంచుకోవడానికి అవసరమైన నైపుణ్యాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, లావణ్య పాల్గొన్నారు.

తప్పుల సవరణకు అవకాశం

గోస్పాడు, జనవరి 5: సమగ్ర భూ సర్వేలో తప్పుల సవరణకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని, దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ విజయశేఖర్ అన్నారు. జిల్లా రెవెన్యూ అధికారుల ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో సమావేశాలు నిర్వహిస్తున్నామని, వాటిలో తమ రికార్డులను తీసుకొని వచ్చి సవరణ చేసుకోవాలని అన్నారు. మండలంలో మూడు విడతల్లో భూ సర్వే జరిగిందని అన్నారు. శుక్రవారం కానాలపల్లె, నెహ్రూనగర్ గ్రామ పంచాయతీలలో సమావేశం నిర్వహించామని అన్నారు. 6న రాయపాడు, తేళ్ళపూరి గ్రామ పంచాయతీ ఆఫీసులలో, 7న జులేపల్లె, పసురుపాడు, 8న సాంబవరం, 9న కృష్ణాపురం, 10న జిల్లెల్ల గ్రామంలో గ్రామ సభలు నిర్వహిస్తామని తెలిపారు.

భూ రీసర్వేపై అభ్యంతరాల స్వీకరణ

గడివేముల, జనవరి 5: భూరక్ష పథకం కింద రీసర్వే జరిగిన గ్రామాల్లో అభ్యంతరాలు స్వీకరిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని మంచాలకట్ట గ్రామంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీసర్వేలో అభ్యంతరాలు ఉన్నవారు 6 నుంచి 16వ తేదీ వరకు సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఈ దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి తప్పులను సరి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జనం లేని జగనన్న ఆరోగ్య సురక్ష

బండిఆత్మకూరు, జనవరి 5: ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమానికి జనం కరువయ్యారు. శుక్రవారం మండలంలోని పెద్దదేవళాపురం గ్రామం సచివాలయం వద్ద కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్యే వచ్చి ముందుగా మందుల శిబిరం, డాక్టర్ల వైద్య చికిత్స ఏర్పాట్లను పరిశీలించారు. సభా ప్రాంగణంలో జనం లేక ఖాళీ కుర్చీలను చూసి నివ్వెరపోయారు. వలంటీర్లు సర్వే సక్రమంగా నిర్వహించక పోవటంతో ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శిల్పా భువనేశ్వరరెడ్డి, ఎంపీపీ చిన్నసంజీవరెడ్డి, కన్వీనర్ శ్రీనివాసరెడ్డి, సొసైటీ చైర్మన్ శివలింగం, ప్రోగ్రాం ఆఫీసర్ కాంతారావు నాయక్, ఎంపీడీవో వాసుదేవగుప్త, డాక్టర్‌లు కిరణ్‌కుమార్, దినేష్ బాబు, మార్కెట్‌యార్డు డైరెక్టర్ విక్రమసింహానాయక్ పాల్గొన్నారు.

నందికొట్కూరు ఎమ్మెల్యే టికెట్ స్థానికులకే ఇవ్వాలి

కొత్తపల్లి, జనవరి 5: నందికొట్కూరు నియోజక వర్గ వైసీపీ ఎమ్మెల్యే టికెట్ స్థానికులకే కేటాయించాలని కొత్తపల్లి మండల వైసీపీ నాయకులు పోత సహదేవుడు, మాజీ సర్పంచ్ మల్లికార్జున యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం వారు కొత్తపల్లిలో వారు మాట్లాడుతూ.. నందికొట్కూరు ఎమ్మెల్యే టికెట్ సీఎం జగన్ స్థానికేతరులకు ఇచ్చినట్లు ప్రచారం అవుతుందని అన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి కాకుండా నియోజక వర్గంలో ప్రజలకు అందుబాటులో ఉండే స్థానిక నాయకులకే ఎమ్మెల్యే సీటు కేటాయించాలని వారు కోరారు.

రైతు భరోసా కేంద్రాల్లో జొన్నల కొనుగోలు

గడివేముల, జనవరి 5: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో సివిల్‌సప్లయ్ ఆధ్వర్యంలో జొన్నల కొనుగోలు చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి హేమసుందర్‌రెడ్డి తెలిపారు. క్వింటాకు రూ.3,180 మద్దతు ధర ఉంటుందని అన్నారు. హమాలి ఖర్చులు, సంచులు, రవాణా చార్జీలు ప్రభుత్వమే భరిస్తుందని అన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

నాయీ బ్రాహ్మణ సంఘం పట్టణ కమిటీ ఎన్నిక

ఆత్మకూరు, జనవరి 5: ఆత్మకూరు పట్టణ నాయీబ్రాహ్మణ సంఘాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక మార్కెట్ యార్డులో జరిగిన ఈ ఎన్నికలో పట్టణాధ్యక్షులుగా శివ పాములేటి, గౌరవాధ్యక్షులుగా శివన్న, ఉపాధ్యక్షులుగా ఎల్లప్ప, గువ్వలకుంట్ల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శులుగా పెద్దస్వాములు, గాలెన్న, కోశాధికారులుగా అనిల్‌కుమార్, రుద్రప్రసాద్, సంయుక్త కార్యదర్శులుగా బోధనం సుబ్బరాయుడు, ఎం.జనార్ధన్, సహాయ కార్యదర్శిగా జీ.శేఖర్, పీ.సుబ్బరాయుడు, జీ.రమణతో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ.. తమపై ఎంతో నమ్మకంతో అప్పగించిన బాధ్యతలకు తగిన న్యాయం చేస్తామని అన్నారు. నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి తమవంతు కృషి చేస్తానని తెలిపారు.

పొగతో చదువుకు ఇక్కట్లు

పాణ్యం, జనవరి 5 : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలల విద్యార్థులు పొగతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంచాయతీ సిబ్బంది గ్రామంలోని చెత్తను విద్యా సంస్థల పక్కనే ఉన్న జుర్రాగు వాగులో వేసి కాలుస్తున్నారు. ఈ పొగ పాఠశాలలోకి రావడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. శుక్రవారం పొగ ధాటికి తట్టుకోలేక విద్యార్థులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని నిరసన వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షులు ప్రతాప్ మాట్లాడుతూ పంచాయతీ అధికారులు గ్రామానికి ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డులో చెత్తను వేయకుండా రహదారి పక్కనే వేస్తున్నారన్నారు.

'రసస్యందిని' పుస్తకావిష్కరణ

నంద్యాల (కల్చరల్), జనవరి 5: నంద్యాల విశ్రాంత వ్యవసాయ శాస్త్రవేత్త కాదర్‌బాద్ రవీంద్రనాథ్ స్వగృహంలో కర్నూలు కేవీఆర్ మహిళా కళాశాల తెలుగు ఉపన్యాసకులు డా.దండెబోయిన పార్వతీదేవి రచించిన రసస్యందిని పుస్తకాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని డాక్టర్ రవీంద్రనాథ్‌కు అంకితం చేశారు. అనంతరం డాక్టర్ పార్వతీదేవి మాట్లాడుతూ తెలుగు సాహిత్య పోషణకు రవీంద్రనాథ్ చేస్తున్న కృషిని ప్రశంసిస్తూ ఆయనను నంద్యాల ఆంధ్రభోజుడుగా అభివర్ణించారు. అనంతరం డాక్టర్ రవీంద్రనాథ్ 88వ జన్మదినాన్ని పురస్కరించుకొని వివిధ సాహితీ సంస్థల ప్రముఖులు ఆత్మీయ సత్కారం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ గెలివి సహదేవుడు, సాహితీవేత్తలు జేఎస్ఆర్‌కే శర్మ, డా.రమణమూర్తి, శ్రీనివాసమూర్తి, లీలావతి, శేషఫణి, మాబుబాషా, ప్రసాద్, నీలం వెంకటేశ్వర్లు, రఫీ, నరేంద్ర, డా.కిషోర్, నీలకంఠమాచారి తదితరులు పాల్గొని రవీంద్రనాథ్ దంపతులకు ఆత్మీయ సత్కారంతోపాటు రసస్యందిని పుస్తకాన్ని అంకితం చేశారు.

వేలాల ద్వారా రూ.2.79 కోట్ల ఆదాయం

మహానంది, జనవరి 5: మహానంది క్షేత్రంలో శుక్రవారం నిర్వహించిన బహిరంగ వేలాల ద్వారా దేవస్థానానికి రూ.2 కోట్ల 79 లక్షల 17 వేల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. రెండు టోల్‌గేట్ల ద్వారా ఏడాదిపాటు వాహనాల రుసుం వసూలు చేసుకునే హక్కును నంద్యాలకు చెందిన శివశంకర్‌రెడ్డి రూ.1,71,22,535లకు దక్కించుకున్నారని చెప్పారు. అలాగే సెల్‌పాయింట్‌ను మహానందికి చెందిన టంగుటూరి మనోహర్‌రెడ్డి రూ.18,27,000, భక్తుల పాదరక్షలు భద్రపరిచే హక్కు ద్వారా రూ.16,03,000, సంప్రదాయ దుస్తుల విక్రయం ద్వారా రూ.8,50,000, తలనీలాల ద్వారా రూ.5,55,000, అభిషేకం పూజా సామగ్రి విక్రయించే హక్కు ద్వారా రూ.47,02,000, మరుగుదొడ్ల నిర్వహణకు రూ.12,50,000 చింతపల సాయం ద్వారా రూ.7,500కు బహిరంగ వేలంలో పోటీదారులు పాల్గొని దక్కించుకున్నారని ఈవో చెప్పారు. కార్యక్రమంలో పాలకమండలి చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, గ్రూపు దేవాలయాల ఈవో జనార్దన్‌శెట్టి ఏఈఓ ఎర్రమల్ల మధు, పర్యవేక్షకులు వెంకటేశ్వర్లు, సిబ్బంది మల్లికార్జునతోపాటు పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

మొండి వైఖరి తగదు

25వ రోజుకు చేరిన అంగన్‌వాడీల సమ్మె ● వివిధ రూపాల్లో నిరసనలు

కనీస వేతనం చెల్లించాలని కోరుతూ గత కొన్ని రోజులుగా సమ్మె చేస్తోంటే ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంపై అంగన్‌వాడీ కార్యకర్తల్లో ఆగ్రహ జ్వాలలు పెల్లుబుకుతున్నాయి. సమ్మె 25వ రోజున శుక్రవారం జిల్లా వ్యాప్తంగా వివిధ రూపాల్లో నిరసనలు తెలియజేశారు. ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం తగదని నినాదాలు చేశారు.

నంద్యాల నూనెపల్లె, జనవరి 5 : తమకు సీఎం జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు విశ్రమించేదిలేదని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నిర్మల స్పష్టం చేశారు. అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధికసమ్మె కొనసాగుతోంది. శుక్రవారం నంద్యాలలోని దీక్షాశిబిరంలో అంగన్‌వాడీలు పాల్గొని ప్రభుత్వానికి నిరసనగా నినాదాలు చేశారు. తమపై ఎంత నిర్బంధం తెచ్చినా, చివరకు ఉద్యోగాల నుంచి తొలగించినా ఉద్యమాన్ని ఆపే ప్రసక్తేలేదని హెచ్చరించారు. ప్రభుత్వమైనా దిగిరావాలి.. లేదా ప్రభుత్వాన్నే సాగనంపాలి అనే ధోరణిలో ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళతామని చెప్పారు. నెలరోజులనుంచి న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం కుటుంబాలను వదిలిపెట్టి రోడ్లపై పడినా ప్రభుత్వానికి కనికరం లేకుండాపోవడం దౌర్భాగ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. దీక్షాశిబిరాన్ని సీఐటీయూ నాయకులు, ప్రజాసంఘాలు సందర్శించి సంఘీభావం తెలిపారు.

బండిఆత్మకూరు: వచ్చే సాధారణ ఎన్నికల్లో ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని అంగన్‌వాడీ నాయకులు వెంకటరమణమ్మ, వసంత, శ్యామలమ్మ, సీఐటీయూ నాయకులు రత్నమయ్య అన్నారు. శుక్రవారం 25వ రోజు బండిఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ కోలాటం వేశారు. వచ్చే ఎన్నికల్లో తమ సత్తా చూపిస్తామని హెచ్చరించారు. డేవిడ్, సుబ్బరాయుడు, రాజు, ఆనందమ్మ పాల్గొన్నారు.

నందికొట్కూరు: సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు డిమాండ్ చేశారు. శుక్రువారం మిడుతూరులో గేదెకు వినతిపత్రం అందజేసి నిరసనలు తెలిపారు. అంగన్‌వాడీ యునియన్ ఏఐటీయూసీ నాయకులు రమేష్, రఘురాంమూర్తి మాట్లాడుతూ అంగన్ వాడీల సమస్యలను పరిస్కరించేవరకు సమ్మె విరమించబోమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అంగన్ వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

గోస్పాడు: అంగన్‌వాడీలు సమ్మె 25వ రోజుకు చేరినా ప్రభుత్వంలో ఎలాంటి మార్పు రాలేదని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యేసురత్నం, బాలవెంకట్ అన్నారు. శుక్రవారం గోస్పాడులో దీక్ష చేస్తున్న అంగన్‌వాడీలకు మద్దతు తెలిపారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకపోతే సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు నిర్మలమ్మ, రమణమ్మ, సువర్ణ, రుక్మిణి, నాగలక్ష్మి, భూలక్ష్మి, ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పాములపాడు: అంగన్‌వాడీ సమ్మెను భగ్నం చేసేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలతో కలిసి ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్‌కుమార్ అన్నారు. శుక్రవారం పాములపాడులో అంగన్‌వాడీలకు సీపీఎం నాయకులు రామేశ్వరరావు, సామన్న వెంకటేశ్వరరావులతో మద్దతు ప్రకటించారు.

పాణ్యం: ప్రభుత్వం బెదిరింపులకు, రెచ్చగొట్టే చర్యలకు పాల్పడితే సచివాలయ ఉద్యోగులను అడ్డుకుంటామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కెఎండీ గౌస్ హెచ్చరించారు. అంగన్‌వాడీలు చేస్తున్న నిరాహార దీక్షలో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు భాస్కర్, నాయకురాళ్లు శ్యామల, హైమావతి, సూర్యప్రభావతి, వఅనసూయ, లక్ష్మీదేవి, నాగసర స్వతి, భారతి, విద్యార్థి సంఘం నాయకులు ప్రతాప్, ఆయాలు పాల్గొన్నారు.

మహానంది: తమ సమస్యలను పరిష్కరించుకుండా సీఎం జగన్మోహన్‌రెడ్డి విధుల్లోకి చేరాలని నోటీసులు పంపించడంపై మహానందిలో అంగన్వాడీ వర్కర్లు దీక్షా శిబిరంలో పొర్లు దండాలు పెట్టారు. శుక్రవారం మహానంది మండల తహసీల్దార్ కార్యాలయం ముందు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ నాయకులు సావిత్రి, ప్రసన్నలక్ష్మి, నిర్మల, జ్యోతి, నారాయణమ్మ, పుష్పకళ, ఫాతిమా మేరిరాణిలు పాల్గొన్నారు.

ఆత్మకూరు: తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీలు చేపడుతున్న నిరసనలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా 25వ రోజైన శుక్రవారం అంగన్‌వాడీలకు ప్రభుత్వం ఇచ్చిన చీరలు, సెల్‌ఫోన్లకు పూజలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు మంజుల, లక్ష్మీదేవి, వెంకటలక్ష్మి, సీఐటీయూ నాయకులు రామ్‌నాయక్, రణధీర్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీలు 24 రోజులుగా నివరధిక సమ్మె చేస్తున్నా సీఎం జగన్ స్పందించక పోవడం సరికాదని అన్నారు. అంగన్‌వాడీల డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించుకునే వరకు పోరాటం ఆపే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కాగా అంగన్‌వాడీలకు రిటైర్డుమెంట్ అనంతరం రూ.5లక్షలతోపాటు వేతనంతో సగం పెన్షన్ ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో ఆసంఘం నాయకులు సుధారాణి, లక్ష్మి, ప్రియాంక, రవణమ్మ, అరుణ, విజయలక్ష్మి, లక్ష్మీదేవి,



నంద్యాలలో నిరవధిక సమ్మెలో పాల్గొన్న అంగన్‌వాడీలు



పాములపాడులో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు రమేశ్



బండిఆత్మకూరులో కోలాటం ఆడుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



ఆత్మకూరులో చీరలు, సెల్‌ఫోన్లకు పూజలు నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు



మహానందిలో సాష్టాంగ నమస్కారం చేస్తున్న కార్యకర్తలు

వైసీపీ అరాచక పాలనకు బుద్ధి చెప్పండి

- శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

ఆత్మకూరు, జనవరి 5: వైసీపీ అరాచక పాలనకు ప్రజలు బుద్ధి చెప్పాలని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆత్మకూరు పట్టణంలోని సాయిబాబానగర్‌లో బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి వైసీపీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాల గురించి వివరించారు. అలాగే టీడీపీ అధికారంలోకి వస్తే ప్రవేశపెట్టే మహాశక్తి పథకాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ప్రజలకు మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన సీఎం జగన్ నేడు రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. దీపం పథకంలో భాగంగా ఏడాదికి 3గ్యాస్‌సిలిండర్ల పంపిణీ, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, తల్లికి వందనం పథకం ద్వారా ఎంత మంది పిల్లలుంటే అంతమందికి ఏడాదికి రూ.15వేలు, ఆడబిడ్డ నిధి ద్వారా 18ఏళ్లు దాటిన మహిళలకు నెలకు రూ.1500 నగదు సాయాన్ని అందించనున్నట్లు వివరించారు. ఇవేకాకుండా రాష్ట్ర ప్రజలకు మేలు జరిగే మరెన్నో పథకాలను ప్రవేశపెట్టనున్నట్లు భరోసా ఇచ్చారు. అంతకుముందు షిర్డీ సాయిబాబా ఆలయంలో స్వామివారిని మాజీ ఎమ్మెల్యే బుడ్డా దర్శించుకున్నారు. కార్యక్రమంలో నాయకులు శివప్రసాద్‌రెడ్డి, వేణుగోపాల్, అబ్దుల్లాపురంబాష, అడ్వకేట్ వెంకటేశ్వర్లు, కొప్పరపు రవిప్రసాద్, రాజారెడ్డి, పుల్లారెడ్డి, నాగూర్‌ఖాన్, సుబ్బరాజు, కమతం సుబ్బయ్య, రామ్మూర్తి, సతీష్, ఆర్టీసీ షఫి, న్యామతుల్లా, వెంకటరావు, జనసేన పార్టీ నాయకులు శ్రీరాములు ఉన్నారు.



సాయిబాబానగర్‌లో భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

మున్సిపల్ కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలి





పొర్లు దండాలతో నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ఆత్మకూరు, జనవరి 5: మున్సిపల్ కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కార్మికులు డిమాండ్ చేశారు. 11వ రోజైన శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరవధిక నిరాహారదీక్షల్లో భాగంగా మున్సిపల్ కార్మికులు పొర్లు దండాలతో నిరసన వెలిబుచ్చారు. సీఐటీయూ నాయకులు రామ్‌నాయక్, రణధీర్, రజాక్ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు నాగన్న, గొడుగు రాజు మాటాడుతూ.. 2019 ఎన్నికల ముందు మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చిన సీఎం జగన్ అధికారంలోకి రాగానే విస్మరించారని అన్నారు. తమకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రిటైర్డుమెంట్ బెనిఫిట్ కల్పించడంతో పాటు వేతనంలో సగం పెన్షన్ సదుపాయం ఇవ్వాలని అన్నారు. కార్మికులు ఎవరైనా మరణిస్తే వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని చెప్పారు. అలాగే కార్మికులకు చెల్లించాల్సిన పీఎఫ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆసంఘం నాయకులు తిమ్మయ్య, నాగన్న, మోహన్, సురేష్, దానమయ్య, రవి, రూతమ్మ, జీవరత్నమ్మ, మణెమ్మ, సుగుణమ్మ, సుశీలమ్మ తదితరులు ఉన్నారు.

నందికొట్కూరు రూరల్: నందికొట్కూరు మున్సిపల్ కార్మికులు శుక్రవారం నాడు కార్యాలయం ఎదుట పొర్లు దండాలతో నిరసనలు తెలిపారు. మున్సిపల్ కార్మికుల నిరవధిక సమ్మె 11 వ రోజు కొనసాగింది. సీఐటీయూ నాయకులు భాస్కర్, పరమేష్, నాగేశ్వరావు, ప్రభాకర్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిస్కరించే వరకు సమ్మెను కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్లు కార్మికులు పాల్గొన్నారు.

వైభవంగా స్వామి, అమ్మవార్లకు ఊయల సేవ

శ్రీశైలం, జనవరి 5: శ్రీశైలం మహాక్షేత్రంలో లోకకల్యాణార్థం శుక్రవారం స్వామి, అమ్మవార్లకు ఊయల సేవను దేవస్థానం ఘనంగా నిర్వహించింది. పూజా కార్యక్రమంలో ముందుగా మహా గణపతి స్వామికి పూజలు జరిపించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ఊయలలో ఆశీనులనుజేసి శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు జరిపారు.

● గ్రామదేవత అంకాలమ్మకు శుక్రవారం లోకకల్యాణాన్ని ఆకాంక్షిస్తూ విశేష పూజలను దేవస్థానం నిర్వహించింది. ఈ పూజలలో భాగంగా అమ్మవారికి పంచామృతాభిషేకం, హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, పుష్పోదకం, విశేష అలంకరణ, కుంకుమార్చన పూజలు నిర్వహించారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం తిరుపతికి చెందిన వి.వి.ఎస్ శ్రీధర్ అనే భక్తుడు కుటుంబ సమేతంగా కలిసి రూ.లక్ష విరాళాన్ని, బెంగులూరుకు చెందిన పి.వి రవీంద్ర అనే భక్తుడు గో సంరక్షణ నిధి పథకానికి రూ. లక్ష విరాళాన్ని సహాయ కార్యనిర్వహణాధికారి ఫణిధర్‌ప్రసాద్‌కు అందజేశారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమం

శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన లక్ష్మీనరసింహస్వామి మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ బృందంచే సంప్రదాయ నృత్యప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో గణేశస్తుతి, శివాష్టకం, బో..శంభో, శంకరా శశిధర, హిమగిరి తనయే, శివాష్టకం తదిత గీతాలకు వైష్ణని, శివాని, రాధ, శ్రీకరి, అక్షర, అక్షయ్య, బృంద, శ్రావ్య, స్వప్న, సమీక్ష తదితరులు నృత్య ప్రదర్శనతో అలరించారు.



స్వామి, అమ్మవార్లకు పూజలు చేస్తున్న దృశ్యం

ఎన్నికల ఏర్పాట్లకు సన్నద్ధం కండి: కలెక్టర్

నంద్యాల (కల్చరల్), జనవరి 5: సార్వత్రిక ఎన్నికల ఏర్పాట్లకు సన్నద్ధం కావాలని కలెక్టర్ డా.మనజీర్‌జిలానీ సమూన్ ఈఆర్‌వో, ఎఈఆర్‌వో, సంబంధిత స్పెషల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో జేసీ రాహుల్‌కుమార్ రెడ్డితో కలిసి ప్రత్యేక ఓటర్ల సవరణ కార్యక్రమం, తదితర అంశాలపై సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నంద్యాల, డోన్, ఆత్మకూరు ఆర్డీవోలు శ్రీనివాసులు, వెంకటరెడ్డి, ఎం.దాసులు, పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఆర్థిక బకాయిల ఉద్యమానికి సిద్ధం కావాలి



మాట్లాడుతున్న ఎస్టీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కుమార్

నంద్యాల నూనెపల్లె, జనవరి 5 : రాష్ట్ర వ్యాప్తంగా 13 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లకు రావాల్సిన ఆర్థిక బకాయిలకై ఉద్యమానికి సిద్ధం కావాలని ఎస్టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.సుధాకర్, కె.కుమార్‌లు పిలుపునిచ్చారు. శుక్రవారం నంద్యాలలోని ఎస్టీటీఎఫ్ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల నుంచి వైసీపీ ప్రభుత్వం బకాయిలు విడుదల చేయకుండా కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. ఉద్యోగులకు రావాల్సిన జీతాలను కూడా నెలలో 1వ తేదీ కాకుండా నెల మధ్యలో, చివరలో మంజూరు చేయడంతో ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. విద్యాభివృద్ధికి పాటుపడకుండా ఏకపక్ష నిర్ణయాలు, నూతన సంస్కరణలు అంటూ విద్యా వ్యవస్థను వైసీపీ ప్రభుత్వం సర్వనాశనం చేసిందని దుయ్యబట్టారు. నూతన విద్యావిధానాన్ని ఉపసంహరించుకోవాలని, ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఇదే వైఖరిని ప్రభుత్వం కొనసాగిస్తే త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నాగరాజు, రాష్ట్ర నాయకులు ధరణి, మాతృనాయక్, వెంకటరాముడు, రామకృష్ణ, కేశాలునాయక్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

గోకులం షెడ్ల పెండింగ్ బిల్లులు చెల్లించాలి



ఉపాధి కార్యాలయం ఎదుట లబ్ధిదారుల ధర్నా

కొత్తపల్లి, జనవరి 5: కొత్తపల్లి మండలంలో మినీ గోకులం షెడ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, వీరాపురం మాజీ సర్పంచ్ చిన్ని పుల్లన్న, సింగిల్ విండో మాజీ డైరెక్టర్ నారాయణ రెడ్డి, ఓబులేసు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు కొత్తపల్లిలోని ఉపాధి కార్యాలయం ముందు మినీ గోకులం షెడ్లు నిర్మించుకున్న లబ్ధిదారులతో కలిసి ధర్నా నిర్వహంచారు. అనంతరం వారు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మండలంలో 116 మంది లబ్ధిదారులకు మినీ గోకులం షెడ్లు మంజూరైనట్లు చెప్పారు. ఏడు సంవత్సరాల క్రితమే లబ్ధిదారులు షెడ్లు నిర్మించుకున్నప్పటికీ నేటికీ ఒక్కొక్క రైతుకు సుమారు రూ.50 వేల చొప్పున పెండింగ్ బిల్లులు రావాల్సి ఉందన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయ పరిపాలనా అధికారికి వినతి పత్రం సమసర్పించారు. కార్యక్రమంలో రైతులు బాల చంద్రుడు, శ్రీనివాసులు, పుల్లయ్య, శ్రీనివసాఉలు, తిరుపాలు, చిన్న రాజారావు, వెంకటస్వామి, సుధాకర్ పాల్గొన్నారు.

కొత్తపల్లిలో రాములోరి అక్షింతలు పంపిణీ

కొత్తపల్లి, జనవరి 5: కొత్తపల్లిలో అయోధ్య రాముల వారి అక్షింతలను స్థానిక భక్త బృందం ఇంటింటికి వెళ్లి పంపిణీ చేసింది. శుక్రవారం సాయంత్రం అయోధ్య నుంచి తెచ్చిన అక్షింతలను రామాలయంలో ఉంచి ప్రత్యేక పూజల అనంతరం భక్త బృందం భజనలు చేసుకుంటూ గ్రామ పుర వీధుల గుండా ఇంటింటికి వెళ్లి పంపిణీ చేసింది. కార్యక్రమంలో అయోధ్య రామజన్మభూమి అభియాన్ సభ్యులు రామకృష్ణ, మల్లెల హనుమంత రెడ్డి, రాజేష్, వినోద్ కుమార్ రెడ్డి కృష్ణుడు చెన్నయ్య, భక్త బృందం పాల్గొన్నారు.

2,585 మందికి రూ.4.02 కోట్ల లబ్ధి

నంద్యాల (కల్చరల్), జనవరి 5: సంక్షేమ పథకాలకు అర్హులై ఉండి ఏకారణం చేతనైనా లబ్ధి పొందని వారికి ద్వైవార్షిక నగదు మంజూరు కింద జిల్లాలో 2,585 మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ.4.02 కోట్లు జమ చేశామని రాష్ట్ర మైనారిటీ సంక్షేమ అభివృద్ధి ప్రభుత్వ సలహాదారు హబీబుల్లా తెలిపారు. శుక్రవారం నవరత్నాలు-ద్వైవార్షిక నగదు పంపిణీ కార్యక్రమానికి సంబంధించి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి నేరుగా వారి ఖాతాల్లో జమ చేశారన్నారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంక్షేమ అభివృద్ధి ప్రభుత్వ సలహాదారుతోపాటు ఎంఎస్ఎంఈ డైరెక్టర్ ఖాజీ మౌలానా అబ్దుల్ కలామ్, బెస్త సంక్షేమ సంఘం డైరెక్టర్ చంద్రశేఖర్, డీఆర్ఓ పుల్లయ్య, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి వీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులు, ప్రభుత్వ సలహాదారులు కలిసి లబ్ధిదారులకు చెక్కు అందజేశారు.

సమర శంఖారావం సభలో బీసీ



టీడీపీ అధినేత చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, జనవరి 5: ఒంగోలు జిల్లా కనిగిరి పట్టణంలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సమర శంఖారావం సభ ఏర్పాట్లను ఒంగోలు, నెల్లూరు పార్లమెంట్ కోఆర్డినేటర్, పొలిటికల్ యాక్షన్ కమిటీ సభ్యుడు బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే గత రెండు రోజులుగా పర్యవేక్షించారు. శుక్రవారం ఉదయం బీసీ స్వయంగా సభా ఏర్పాట్లు పరిశీలించి పర్యవేక్షించారు. కనిగిరి సమరశంఖారావం బహిరంగ సభకు వచ్చిన చంద్రబాబుకు బీసీ జనార్దన్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఏర్పాట్లపై చంద్రబాబు అభినందించారని బీసీ తెలిపారు.

'చంద్రబాబు సభను విజయవంతం చేయాలి'

రుద్రవరం, జనవరి 5: ఆళ్లగడ్డలో ఈ నెల 9న టీడీపీ అధినేత చంద్రబాబు హాజరయ్యే బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం రుద్రవరం వాసవీ కళ్యాణ మండపంలో టీడీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ లక్ష మంది సభకు ఆళ్లగడ్డ వేదిక కానుందని అన్నారు. భార్గవరామ్‌నాయుడు, రంగనాయకులు, వెంకట నారాయణ, గురుమూర్తి, ప్రతాప్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, నారాయణరెడ్డి, యల్లావత్తుల సర్పంచ్ చంద్రమోహన్, బలరామ్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, పార్థసారధిరెడ్డి, కాంత్, యడవల్లి శ్రీనివాసులు, రాజారావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే పక్కాగా నిర్వహించాలి: జేసీ



చెన్నంపల్లెలో రైతులతో మాట్లాడుతున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

అవుకు జనవరి 5: భూ రీసర్వే పక్కాగా నిర్వహించాలని జాయింట్ కలెక్టరు రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. డోన్ ఆర్డీవో వెంకటరెడ్డి, అవుకు తహసీల్దారు ప్రసాద్‌బాబులతో కలసి మండలంలోని చెన్నంపల్లె గ్రామంలో శుక్రవారం భూ రీసర్వే గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ కొన్ని గ్రామాల్లో భూసర్వేలో అవకతవకలు జరిగినట్లు రైతుల నుంచి ఫిర్యాదులు అందడంతో గ్రామ సభ నిర్వహించామన్నారు.

చెక్కుల పంపిణీ

బేతంచెర్ల, జనవరి 5: వైద్య చికిత్స కోసం బాధితులకు మంజూరైన రూ.3.60 లక్షలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బేతంచెర్ల ఎంపీపీ నాగభూషణం రెడ్డి శుక్రవారం పంపిణీ చేశారు. ఈ చెక్కులను బేతంచెర్ల పట్టణానికి చెందిన పాపసాని రామిరెడ్డికి రూ.1.20 లక్షలు, సద్దల వెంకట్రామిరెడ్డికి రూ.1.20 లక్షలు, మండలంలోని గోరుమానుకొండ తండా గ్రామానికి చెందిన నేనావత్తు మల్లయ్య నాయక్‌కు రూ.70వేలు, ముసలాయ చెరువు గ్రామానికి చెందిన మిడతూరి రాంభూపాల్ రెడ్డికి రూ.50వేలు వెరసి రూ.3.60 లక్షలు చెక్కులను పంపిణీ చేశారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ కమిటీ సభ్యులు ముర్తుజావలి, సింగిల్ విండో చైర్మన్ రుద్రవరం నారాయణ, మండల కన్వీనర్ తిరుమలేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన

రుద్రవరం, జనవరి 5: మండలంలోని తిప్పారెడ్డిపల్లె, టి.లింగందిన్నె గ్రామాల్లో ఈవీఎంలపై మహిళలకు ఓటు హక్కు ఎలా ఉపయోగించాలో అధికారులు అవగాహన కల్పించారు. తమ ఓటు ఎవరికి వేశాం, ఎవరి నమోదైంది అన్న అంశాలపై మహిళలకు, గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. వీఆర్వోలు నరసింహ, పుల్లయ్య, ఓబయ్య పాల్గొన్నారు.

మినుము పంట దున్నివేత



వెలగలపల్లె మినుము పంటను తొలగిస్తున్న దృశ్యం

రుద్రవరం, జనవరి 5: మండలంలోని వెలగలపల్లె రెవెన్యూ పరిధిలో రుద్రవరం గ్రామానికి చెందిన బాషా అనే రైతు ట్రాక్టరుతో మినుము పంటను శుక్రవారం దున్నివేశారు. వైరస్ సోకి పైరు ఎదుగుదల లేకపోవడంతో దున్నివేశారు. పెట్టుబడి అంతా వృథా అయిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. రెండు ఎకరాల్లో పంట దున్నివేశామని ఆవేదన వ్యక్తం చేశారు.

కొలిమిగుండ్లలో సామాజిక తనిఖీ బహిరంగ సభ

కొలిమిగుండ్ల, జనవరి 5: కొలిమిగుండ్లలో ఉపాధిహామీ పనులపై సోషల్ ఆడిట్ బహిరంగ సభ డ్వామా పీడీ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. 17వ సోషల్ ఆడిట్‌కు సంబంధించి 2022 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2023 మార్చి 31 వరకు జరిగిన ఉపాధి పనులపై కార్యక్రమం నిర్వహించారు. మొత్తం రూ.4.60 కోట్లు, మెటీరియల్ కింద రూ.1.60 కోట్ల పనులకు బహిరంగ సభ నిర్వహించారు. రూ.35 వేలు రికవరీ చేయాలని డ్వామా పీడీ రామచంద్రారెడ్డి ఆదేశించారు. ఏపీడీ సాంబశివరావు, డీవీవో బాలాజీనాయక్, ఎంపీడీవో సాయికృష్ణ, ఎస్‌ఆర్‌సీ కన్నారెడ్డి, ఏపీవో గంగన్న, ఈసి.రాజబాబు, డీఆర్‌పీలు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పెద్దవెంతుర్ల సర్పంచ్‌గా లక్ష్మీదేవి

కొలిమిగుండ్ల, జనవరి 5: పెద్దవెంతుర్ల గ్రామానికి చెందిన లక్ష్మీదేవికి సర్పంచ్ బాధ్యతలు ఎంపీడీవో సాయికృష్ణ శుక్రవారం అప్పగించారు. గతంలో గ్రామ సర్పంచ్‌గా విధులు నిర్వహించిన పద్మాంజలి అనారోగ్య కారణాలతో తన సర్పంచ్ పదవికి ఇటీవల రాజీనామా చేశారు. ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ఉప సర్పంచ్‌గా ఉన్న లక్ష్మీదేవికి సర్పంచ్ బాధ్యతలు అప్పగించినట్లు ఎంపీడీవో తెలిపారు.

'భూ రీసర్వేపై అభ్యంతరాలు ఉంటే చెప్పాలి'

రుద్రవరం, జనవరి 5: భూ రీసర్వేపై అభ్యంతరాలు ఉంటే చెప్పాలని తహసీల్దారు రవీంద్రప్రసాద్ సూచించారు. టి.లింగందిన్నె గ్రామంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. గ్రామ సభలో రైతుల భూములకు ఎక్కువ తక్కువ ఉన్న వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. రెండో విడత భూ రీసర్వేలో టి.లింగందిన్నె గ్రామంలో సర్వే చేశారు. డిప్యూటీ తహసీల్దారు మహబూబ్‌బాషా, వీఆర్వో పుల్లయ్య తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

చాగలమర్రి: చాగలమర్రిలోని సచివాలయం వద్ద రీసర్వే అభ్యంతరాలపై శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. తహసీల్దార్ సుభద్రమ్మ మాట్లాడుతూ 16వ తేదీ వరకు భూ రీసర్వేపై గ్రామ సభలు నిర్వహిస్తామని, భూముల సమస్యల గురించి తెలుపుకోవచ్చని సూచించారు. 15 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. ఆర్ఐ శ్రీనివాసరెడ్డి, వీఆర్వోలు పాల్గొన్నారు.

25వ రోజు సమ్మె

- వినూత్నంగా నిరసన తెలిపిన అంగన్‌వాడీలు
- డిమాండ్లు నెరవేర్చే దాకా సమ్మె విరమించబోమని స్పష్టీకరణ
- నిర్లక్ష్యం చేయడం తగదని హెచ్చరిక
- మద్దతు తెలిపిన టీడీపీ నాయకులు



ఆళ్లగడ్డలో సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



కొలిమిగుండ్లలో మద్దతు తెలుపుతున్న బీసీ ఇందిరమ్మ



చాగలమర్రిలో పొర్లు దండాలు పెడుతూ నిరసన



దొర్నిపాడులో చెవిలో పూలు పెట్టుకొని నిరసన



డోన్‌లో ఒంటికాలిపై నిలబడి నిరసన

ఆళ్లగడ్డ, జనవరి 5: అంగన్‌వాడీ కార్యకర్తల సమ్మె కొనసాగుతోంది. పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద శుక్రవారం అంగన్‌వాడీ మాట్లాడుతూ తమ డిమాండ్లను వెంటనే అమలు చేయాలంటూ నినాదాలు చేశారు. డిమాండ్లను ఒప్పుకునేంత వరకు సమ్మె విరమించేది లేదన్నారు.

రుద్రవరం: సీఎం జగన్ అంగన్‌వాడీలకు మాట ఇచ్చి మడమ తిప్పారని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ఆరోపించారు. శుక్రవారం రుద్రవరం తహసీల్దారు కార్యాలయం వద్ద 25వ రోజు నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ 25 రోజుల నుంచి సమ్మె చేస్తున్నా ఎవరూ పట్టించుకోకవడం దారుణమన్నారు. తమ డిమాండ్‌లను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

చాగలమర్రి: అంగన్‌వాడీల సమస్యలు వైసీపీ ప్రభుత్వానికి పట్టవా? అని టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహుడు ప్రశ్నించారు. చాగలమర్రిలోని దీక్షా శిబిరం ఎదుట శుక్రవారం అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన సమ్మెకు సంఘీభావం తెలిపారు. అంగన్‌వాడీలు, హెల్పర్లు కలిసి శిబిరం ఎదుట పొర్లు దండాలతో నిరసన చేశారు. సీఎం జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా అన్యాయం చేస్తున్నారని వాపోయారు.

దొర్నిపాడు: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ సిబ్బంది శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద చెవిలో పూలు పెట్టుకొని వినూత్న నిరసన చేపట్టారు. 25 రోజులుగా ధర్నా చేస్తున్న ప్రభుత్వంలో ఎలాంటి చలనం లేక లేకపోవడం విచారకరమన్నారు. అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని వారు హెచ్చరించారు.

ఉయ్యాలవాడ: అంగన్‌వాడీ వర్కర్లు గత 25 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవటం సిగ్గుచేటని బీజేపీ ఆళ్లగడ్డ ఇన్‌చార్జి భూమా కిషోర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తహసీల్దారు కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మెకు మద్దతు తెలిపారు. కిషోర్‌రెడ్డి మాట్లాడుతూ నిత్యావసర వస్తుల ధరలు పెంచిన ప్రభుత్వం అంగన్‌వాడీల జీతాలు ఎందుకు పెంచటం లేదని ప్రశ్నించారు. బీజేపీ నాయకులు ఆవుల రాఘవేంద్రరెడ్డి, అంబటి మహేశ్వరరెడ్డి, జనసేనా మండల నాయకులు దూదేకుల బాబు, అబ్దుల్లా, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

బనగానపల్లె: బనగానపల్లె ఎంపీడీవో కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె శుక్రవారం 25వ రోజుకు చేరుకుంది. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలపై సీఎం జగన్ కక్షగట్టారని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ విమర్శించారు. శుక్రవారం కొలిమిగుండ్లలో అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మెకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ మూలే రామేశ్వరరెడ్డి, ప్రచార కార్యదర్శి కోటపాడు శివరామిరెడ్డి, తోట శివారెడ్డి, మంద గోపాల్, టీడీపీ అధికార ప్రతినిధి లాయర్ విజయకుమార్, డిష్ గోపాల్, చిన్నపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంజామల: సంజామలలోని పాత ఎంపీడీవో కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు శుక్రవారం సమ్మె కొనసాగించారు. కార్యకర్తలు, ఆయాలు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: పట్టణంలోని తహసీల్దారు కార్యాలయం ఆవరణలో అంగన్‌వాడీల సమ్మె కొనసాగించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు వంటావార్పు చేసి నిరసన తెలిపారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

డోన్(రూరల్): అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్లు ఒంటికాలిపై నిలబడి నిరసన తెలియజేశారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు చేపట్టిన నిరసన దీక్షలు శుక్రవారం 25వ రోజుకు చేరుకున్నాయి. సీపీఎం నాయకులు, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీల సమ్మె 25వ రోజుకు చేరుకుంది. ఒంటికాలిపై నిలబడి, పొర్లు దండాలు పెడుతూ అంగన్‌వాడీ వర్కర్లు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



బేతంచెర్లలో..



సంజామలలో..



కోవెలకుట్లలో వంటా వార్పు

'టీడీపీతోనే ప్రజా సంక్షేమం'

రుద్రవరం, జనవరి 5: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని కొండమాయపల్లె, పాత వెలగలపల్లె, కొత్త వెలగలపల్లె గ్రామాల్లో 'బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి మేనిఫెస్టో గురించి వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బండారు బాలరాజు, మధుసూదన్‌రెడ్డి, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

చాగలమర్రి: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ గ్రామ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని మల్లేవేముల గ్రామంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ కరపత్రాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ వైసీపీకి రోజులు దగ్గరపడ్డాయని అన్నారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీకి ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. టీడీపీ నాయకులు ప్రమోద్‌కుమార్, నరసింహులు పాల్గొన్నారు.



బనగానపల్లెలో ప్రచారం చేస్తున్న బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ అన్నారు. పట్టణంలోని కొండపేటలోని చింతమానుమఠం వీధిలో శుక్రవారం 'బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి టీడీపీ ప్రవేశపెట్టబోయే పథకాల గురించి వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మట్టి గుంతలో కూరుకుపోయిన బస్సు



మట్టిగుంతలో కూరుకుపోయిన బస్సు

డోన్(రూరల్), జనవరి 5: డోన్ మండలం చిన్నమల్కాపురం సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి రోడ్డు పక్కనే ఉన్న మట్టి గుంతలో ఆర్టీసీ బస్సు కూరుకుపోయింది. ఈ ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. డోన్ ఆర్టీసీ డిపో నుంచి బేతంచెర్లకు వెళ్తున్న ఆర్డినరి బస్సు సర్వీసు 25 మంది ప్రయాణికులతో బేతంచెర్ల వెళ్తుండగా.. ఈ సంఘటన చోటు చేసుకుంది. అయితే ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం జరగలేదని డోన్ ఆర్టీసీ డిపో మేనేజర్ శశిభూషణ్ తెలిపారు.

వరి సాగుకు నీరు ఇవ్వలేం: డీఈ

చాగలమర్రి, జనవరి 5: రబీ సీజన్‌లో వరి సాగుకు నీరు ఇవ్వలేమని డీఈ బ్రహ్మారెడ్డి తెలిపారు. శుక్రవారం రాజోలి ఆనకట్ట వద్ద ఎక్స్‌కవేటర్‌తో ముళ్ల కంపలు తొలగించేందుకు పనులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కేసీ ఆయకట్టు పరిధిలో రబీ సీజన్‌లో పంటలు సాగు చేసుకోరాదని సూచించారు. కేసీ కాలువకు నీరు నిలిపి వేశామని అన్నారు. కేసీ కాలువ ఇరుపక్కల ముళ్ల కంపలను తొలగించి రహదారులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. రైతులు స్వచ్ఛందంగా కాలువ కట్టపై ఉన్న ముళ్ల కంపలు తొలగించేందుకు సహకరించాలని కోరారు. ఏఈ జమాల్‌వలి, సూపర్‌వైజర్లు దస్తగిరి, నాయుడు, లస్కర్లు ఉన్నారు.

'పిల్లలు బడిలోనే ఉండాలి'

డోన్(రూరల్), జనవరి 5: బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలని డోన్ పాతపేట జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వెంకట సుబ్బారెడ్డి సూచించారు. శుక్రవారం ఈ మేరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఖాజీకి సన్మానం

ప్యాపిలి, జనవరి 5: పట్టణంలోని జామియా మజీద్‌లో శుక్రవారం ప్రభుత్వ సర్ ఖాజీ మహబూబ్ ఖాన్‌ను ముసింలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఫజుల్ రెహమాన్, రహంతుల్లా బాషా, ఖాజాహుసేన్ తదితరులు పాల్గొన్నారు.

'రైతులను ఆదుకోవాలి'

ఉయ్యాలవాడ, జనవరి 5: శనగ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ ఆళ్లగడ్డ ఇన్‌చార్జి భూమా కిషోర్‌రెడ్డి కోరారు. శుక్రవారం హరివరంలో శనగ పంటను ఆయన పరిశీలించి పంట దిగుబడుల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. బీజేపీ నాయకులు రాఘవేంద్రరెడ్డి, మహేశ్వరరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శివారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, చంద్రమౌలీశ్వరరెడ్డి, బోయ శ్రీను, జనసేన మండల నాయకులు దూదేకుల బాబు, అబ్దుల్లా, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి బుద్ధి చెబుతాం: సీపీఐ

బనగానపల్లె, జనవరి 5: సిద్ధేశ్వరం అలుగు నిర్మించకుంటే వైసీపీ ప్రభుతానికి బుద్ధి చెబుతామని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు హెచ్చరించారు. శుక్రవారం బనగానపల్లెలోని సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాయలసీమ ప్రాజెక్టుల కోసం పోరాడుతున్న బొజ్జా దశరథరామిరెడ్డిని అరెస్టు చేయడం దారుణమన్నారు. సీపీఐ జిల్లా సమితి సభ్యుడు శివయ్య, బాలకృష్ణ, సంజీవులు, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

'వివేకానందుని అడుగు జాడల్లో నడవాలి'

బేతంచెర్ల, జనవరి 5: యువత, విద్యార్థులు స్వామి వివేకానందుని అడుగుజాడల్లో నడవాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మరియదాసు సూచించారు. స్వామి వివేకానందుని జయంతిని పురస్కరించుకుని కర్నూలు రహదారిలోని గోరుమానుకొండ సమీపంలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో యువజన దినోత్సవ వారోత్సవాలను వికాస భారతి ఆధ్వర్యంలో నిర్వహించారు. వికాసభారతి తరుపున నాగమోహన్ రెడ్డి, చంద్రమౌళీశ్వర రెడ్డి విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు.

కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మె



డోన్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో పొర్లు దండాలు పెడుతూ నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు



ఆళ్లడ్డ మున్సిపల్ కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న కార్మికులు



డోన్‌లో మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్య

ఆళ్లగడ్డ, జనవరి 5: పట్టణంలో మున్సిపల్ కార్మికుల సమ్మె కొనసాగుతోంది. శుక్రవారం కార్మికులు పనికి తగిన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

డోన్(రూరల్): మున్సిపల్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో పొర్లు దండాలు చేస్తూ మున్సిపల్ కార్మికులు నిరసన తెలిపారు. పట్టణంలోని పాతబస్టాండు సమైక్యాంధ్ర కట్ట నుంచి గాంధీ బొమ్మ విగ్రహం వరకు పొర్లు దండాలు పెడుతూ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం, సీఐటీయూ నాయకులు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

డోన్(రూరల్): సమస్యలు పరిష్కారం కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారం కొనసాగించారు. ఏఐటీయుసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్య మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించేంత వరకు ఆందోళన కొనసాగుతుందని హెచ్చరించారు.

వైభవంగా పల్లకీ సేవ



చౌడేశ్వరీమాతకు పల్లకీ సేవ నిర్వహిస్తున్న వేద పండితులు

బనగానపల్లె, జనవరి 5: మండలంలోని నందవరం చౌడేశ్వరీమాత ఆలయంలో శుక్రవారం చండీహోమం ఆలయ ఈవో రామానుజన్ ఆధ్వర్యంలో వేదపండితుల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పల్లకీ సేవ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

అయోధ్య అక్షింతల పంపిణీ

సంజామల, జనవరి 5: అయోధ్య రామయ్య అక్షింతలను సంజామలలో శుక్రవారం సాయంత్రం పంపిణీ చేశారు. గ్రామ పెద్దలు ఆర్ఎస్ఎస్, బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో అయోధ్య నుంచి సంజామల మండలానికి చేరుకున్న అక్షింతలను కోట వీధిలోని రామాలయంలో పూజలు నిర్వహించి ఆయా గ్రామాలతో పాటు మండల కేంద్రమైన సంజామలలోని హిందులకు అక్షింతలు పంపిణీ చేశారు. రఘురామయ్య, రాజారెడ్డి, రవీంద్రుడు, ప్రతాప్‌రెడ్డి, కృష్ణమూర్తి, భజన బృందం నాయకులు ఓబుళరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

చాగలమర్రి, జనవరి 5: చాగలమర్రిలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో చదువుతున్న 9వ తరగతి విద్యార్థిని జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. ఎస్టీయూ ఆధ్వర్యంలో పాఠశాల హెచ్‌ఎం కోటయ్య శుక్రవారం రూ.3 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ నెల 10న రాజస్థాన్ రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తుందని చెప్పారు. ఎస్టీయూ నాయకులు శివశంకర్, నారాయణరెడ్డి, మహబూబ్‌బాషా, శ్రీనివాసులు, సురేషప్ప, రాజశేఖర్‌రెడ్డి, మోహన్‌రాజు, పీడీ దాదాపీర్, భారతి పాల్గొన్నారు.

'జొన్నలు కొనుగోలు చేస్తాం'

చాగలమర్రి, జనవరి 5: జిల్లా పౌరసరఫరాల శాఖ అనుసంధానంతో రైతుల నుంచి జొన్నలు కొనుగోలు చేస్తామని ఏవో రంగసేతాజీ తెలిపారు. మండలంలోని పెద్దవంగలి గ్రామంలో శుక్రవారం రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. 2 లేదా 3 ఆర్‌బీకేలను క్లస్టర్‌గా చేసి జొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. జొన్నలు విక్రయించుకోవాల్సిన రైతులు పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. జొన్నలు క్వింటా రూ.3,180 ప్రకారం కొంటారని తెలిపారు. వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పది మంది బైండోవర్

ఉయ్యాలవాడ, జనవరి 5: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన పది మందిపై బైడవర్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం మాయలూరు, గోవిందపల్లె గ్రామాలకు చెందిన పది మందిని తహసీల్దారు ముందు ప్రవేశపెట్టారు. ఇక నుంచి ఏడాది పాటు పోలీసుల అదుపులో ఉండాలని గ్రామాల్లో అల్లర్లకు పాల్పడవద్దని సూచించారు.

మద్యం స్వాధీనం

బేతంచెర్ల, జనవరి 5: పట్టణంలోని బలపాలపల్లె రస్తాలో ఉన్న సిద్ధప్ప దేవాలయం సమీపంలో మద్యం విక్రయిస్తున్న మహిళను అరెస్టు చేసి 9 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ శివశంకర్ నాయక్ శుక్రవారం తెలిపిన వివరాలివీ.. సంజీవనగర్‌కు చెందిన గాజుల రాములమ్మ అనే మహిళ సిద్ధప్ప దేవాలయం సమీపంలో క్వార్టర్ బాటిళ్లు విక్రయిస్తుండగా.. ఆమెను అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. డోన్ కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ నిందితురాలిని రిమాండ్‌కు ఆదేశించారని ఆయన తెలిపారు.

సూర్యనారాయణకు ఘన నివాళి

బేతంచెర్ల, జనవరి 5: కమ్యూనిస్టు నాయకుడు సూర్యనారాయణ 36వ వర్ధంతిని శుక్రవారం బేతంచెర్ల లారీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లయ్య, సీపీఎం బేతంచెర్ల పట్టణ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, నాయకులు రామాంజనేయులు, సీఐటీయూ మండల కార్యదర్శి రహంతుల్లా, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు గుల్జార్బీ, నాగలక్ష్మి, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.మధుశేఖర్, జీపు, కారు వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కృష్ణమూర్తి పాల్గొన్నారు.